నమస్తే తెలంగాణ
జోగులాంబ గద్వాల
వనపర్తి
5 | మహబూబ్‌నగర్, ఆదివారం 21 జూలై 2024 | JOGULAMBA GADWAL WANAPARTHY

## రుణమాఫీ జాబితాలో నాపేరు లేదు..



ప్రభుత్వం రూ.లక్షలోపు రుణాలన్నీ మాఫీ చేస్తామని చెప్పడంతో తన రుణం కూ డా మాఫీ అయ్యిందని గట్టు ఎస్‌బీఐకి శనివారం వెళ్లా ను. కానీ రుణమాఫీ జాబితాలో నా పేరే లేదని బ్యాంకు అధికారులు చెప్పారు. నాకు పం ట రుణం రూ. 50 వేలు ఉన్న ది. అయినా ఎందుకు మాఫీ కాలేదో అర్థం కావడం లేదు. వ్యవసాయాధికారుల వ ద్ద కు వెళితే వారు ఎలాంటి సమాధానం చెప్పడం లేదు. ఎవరిని అడగాలో అర్థమైతలేదు.

*– శాంతన్న, రైతు, గట్టు, గద్వాల జిల్లా*

# రుణమాఫీ.. అయోమయం

- వ్యవసాయ కార్యాలయాలు, బ్యాంక్‌ల చుట్టూ రైతుల ప్రదక్షిణలు

గట్టు, జూలై 20 : కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన రుణ మాఫీ పథకం అయోమయంగా మారింది. ఒకవైపు రూ.లక్షలోపు పంట రుణాలను మాఫీ చేశామని, రైతుల అకౌంట్లలో నిధులు జమ చేశామని ప్రభుత్వం చెబుతుండగా మరోవైపు రూ.లక్షలోపు రుణం ఉన్న రైతులు తమకు రుణమాఫీ కాలేదని వ్యవసాయ కార్యాలయాలు, బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారు. అయితే ఎవరూ రైతులకు సరైన సమాధానం చెప్పలేకపోతున్నారు. గట్టు మండలంలో పీఏసీసీఎస్ కార్యాలయం ఒక్కటే ఉన్నది. దీంట్లో పంట రుణాలు తీసుకున్న రైతులు 824మంది ఉన్నారు. ఈ క్రమంలో రూ.లక్షలోపు రుణం తీసుకున్న రైతులు 706మంది ఉన్నారు. వీరిలో రూ.1.50లక్షల లోపు రుణం తీసుకున్న వారు 72మంది ఉండగా, రూ.2లక్షలలోపు 23మంది, రూ.2లక్షలకుపైగా రుణాలు తీసుకున్న రైతులు మరో 23మంది ఉన్నారు. కాగా రూ.లక్షలోపు రుణం తీసుకున్న వారు 706మందిలో కేవలం 282మంది రైతులకు మాత్రమే రుణమాఫీ అయినట్లు అధికారులు చెబుతున్నారు. మిగిలిన 424మంది రైతులు రుణమాఫీ కాక అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. గట్టు ఎస్‌బీఐ, మాచర్ల ఆంధ్రాబ్యాంక్, సింధనూర్ ఏపీజీవీబీలో కూడా ఇదే పరిస్థితి ఉంది. గందరగోళంగా ఉందని రైతులు వాపోతున్నారు.



జాబితాలో తమ పేర్లు చూసుకుంటున్న రైతులు

## రైతును విచారించిన అధికారులు

నమస్తే ఎఫెక్ట్


కొత్తకోట, జూలై 20 : మండలంలోని చర్లపల్లి గ్రామానికి చెందిన నర్సింహాగౌడ్‌కు రూ.40వేలు రుణమాఫీ కాలేదు. దీనిపై 19వ తేదీన 'నమస్తే తెలంగాణ' దినపత్రికలో ప్రచురితం కావడంతో బాధితుడికి ఫోన్ చేసి వివరాలు సేకరించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. ఈ విషయంపై వ్యవసాయ కమిషనర్ నుంచి రైతును విచారించి న్యాయం చేయాలని ఏవో మున్నాకు సూచించారు. ఇలాంటి తప్పులు మరోసారి కాకూడదని, వెంటనే బాధితుడికి న్యాయం చేయాలని వ్యవసాయ కమిషనర్ ఏవోను ఆదేశించారు.

## గొరిట సబ్‌స్టేషన్ పరిశీలించిన సీజీఎం



గొరిటలో రైతులతో మాట్లాడుతున్న సీజీఎం భిక్షపతి

తిమ్మాజిపేట, జూలై 20 : విద్యుత్ సమస్యపై చేగుంట గ్రామస్తులు శుక్రవారం గొరిట సబ్‌స్టేషన్ వద్ద నిర్వహించిన ఆందోళనపై విద్యుత్ అధికారులు స్పందించారు. శనివారం సబ్‌స్టేషన్‌ను టీజీఎస్‌పీడీసీఎల్ చీఫ్ జనరల్ మేనేజర్ భిక్షపతి పరిశీలించారు. ఈ సందర్భంగా చేగుంట, గొరిటకు చెందిన రైతులతో మాట్లాడారు. రెండు గ్రామాల్లో విద్యుత్ సమస్య ఉన్నదని, వాటిని గుర్తించామన్నారు. రెండు గ్రామాలకు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేసేందుకు ఏర్పాట్లు చేస్తామన్నారు. 15రోజుల్లో సమస్యను పూర్తిగా పరిష్కరిస్తామన్నారు. గొరిట సబ్‌స్టేషన్‌లో ఇప్పుడు న్న 5.1ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌కు అదనంగా మరో 3.15ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ అమర్చుతామన్నారు. ఆయన వెంట డీఈ శ్రీధర్‌శెట్టి, ఏడీ ఆదిశేషయ్య, ఏఈ సాయన్నగౌడ్ ఉన్నారు.



జూరాల డ్యాం గేట్ల వద్ద కృష్ణమ్మ జలసవ్వడి

*బిరబిరా కృష్ణమ్మ కదిలొచ్చింది.* కర్ణాటకలోని ఆల్మట్టి, నారాయణపూర్ జలాశయాల నుంచి పరవళ్లు తొక్కుతున్నది. జూరాల ప్రాజెక్టు జలకళ సంతరించుకున్నది. భారీగా వరద వస్తుండడంతో 17 గేట్లను అధికారులు తెరిచి దిగువనున్న శ్రీశైలానికి వదలుతున్నారు. ఇన్‌ఫ్లో 90,800 క్యూసెక్కులు ఉండగా.. అవుట్‌ఫ్లో 1,04,416 క్యూసెక్కులుగా నమోదైంది. ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వలతోపాటు భీమా లిఫ్ట్‌నకు నీటిని విడుదల చేశారు. ఎగువ, దిగువ హైడల్ ప్రాజెక్టుల్లోని పది యూనిట్లలో విద్యుదుత్పత్తి కొనసాగుతున్నది. అలాగే తుంగభద్ర డ్యాం సైతం 68 టీఎంసీలకు చేరగా.. ఇన్‌ఫ్లో 1,02,744 క్యూసెక్కులు, అవుట్‌ఫ్లో 1,527 క్యూసెక్కులుగా నమోదైంది.

*– గద్వాల, జూలై 20*

# కదిలొచ్చిన కృష్ణమ్మ

- జూరాల ప్రాజెక్టుకు భారీగా వరద
- 17 గేట్ల ద్వారా నీటి విడుదల
- ఇన్‌ఫ్లో 90,800 క్యూసెక్కులు.. అవుట్‌ఫ్లో 1,04,416 క్యూసెక్కులు
- హైడల్ ప్రాజెక్టుల్లో విద్యుదుత్పత్తి
- మల్లన్న చెంతకు బిరబిరా పరుగులు

కర్ణాటకలోని అల్మట్టి, నారాయణపూర్ జలాశయాల నుంచి వరద నీరు వచ్చి చేరుతుండడంతో కృష్ణమ్మకు భారీగా వరద వస్తున్నది. దీంతో అధికారులు జూరాల గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. గత ఏడాది వర్షాకాంలో వర్షాలు సకాలంలో కురువక పోవడంతో ప్రాజెక్టులు నిండకపోవడంతో రైతులు నానా అవస్థలు పడ్డారు. ఈ ఏడాది ముందస్తుగానే వర్షాలు కురువడంతో ప్రాజెక్టులు జలకళను సంతరించుకుంటున్నాయి. జలాశయాలకు భారీగా వరద నీరు వచ్చి చేరుతుండంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ వానకాలం సాగుకు ఎటువంటి నీటి ఇబ్బందులు ఉండవనే ఆలోచనతో జూరాల పరిధిలో రైతులు వరినాట్లు వేయడానికి ఇప్పటికే నార్లు పోసుకోగా ప్రాజెక్టు నిండుతుండడంతో జూరాల కుడి, ఎడమ కాల్వలకు అధికారులు నీటిని విడుదల చేశారు. దీంతో రైతులు నాట్లు వేయడానికి తమ పొలాలను చదును చేయడానికి ఏర్పాట్లు చేసుకుంటున్నారు. జూరాల ప్రాజెక్టుకు సాయంత్రం నాలుగు గంటల వరకు ఎగువ నుంచి 90,800 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతున్నది. జూరాల పూర్తిస్థాయి నీటిమట్టం 318.516 మీటర్లు కాగా ప్రస్తుతం 317.600 మీటర్లుగా ఉంది. పూర్తిస్థాయి నీటి నిల్వ 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుత నీటి నిల్వ 7.645గా ఉన్నది. ఐదు గేట్ల ద్వారా పవర్‌హౌస్‌కు నీటిని విడుదల చేయగా, మరో 12గేట్ల ద్వారా 66,810 క్యూసెక్కులు దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. ఎగువ, దిగువ జూరాల జలవిద్యుత్ కేంద్రాల్లో విద్యుత్ ఉత్పత్తి కొనసాగుతుంది. జూరాలకు ఇన్‌ఫ్లో 90,800 క్యూసెక్కులు వస్తుండగా అవుట్ ఫ్లో ద్వారా దిగువకు 1,04,416 నీటిని విడుదల చేస్తున్నారు. జూరాల ప్రాజెక్టు నుంచి విద్యుత్ ఉత్పత్తికి 33,084 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తుండగా, నెట్టెంపాడ్ లిఫ్ట్‌కు 1,500, భీమా లిఫ్ట్‌కు-1కు 1,300, భీమా లిఫ్ట్-2కు 750, జూరాల ఎడమ కాల్వకు 870, కుడికాల్వకు 467, ప్యారలాల్ కాల్వకు 300 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. జూరాల ప్రాజెక్టు గేట్లు ఎత్తడంతో కృష్ణమ్మ శ్రీశైలం వైపు పరుగులు పెడుతున్నది. ముఖ్యంగా నారాయణపూర్ డ్యాం 22 గేట్లు ఎత్తగా దిగువకు 99,225 క్యూసెక్కులు విడుదల చేసినట్లు ప్రాజెక్టు అధికారులు తెలిపారు. జూరాల గేట్లు తెరచుకోవడంతో సందర్శకులు పెద్ద ఎత్తున తరలివస్తున్నారు.

## టీబీ డ్యాం @ 68 టీఎంసీలు

అయిజ, జూలై 20 : కర్ణాటకలోని ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు తుంగభద్ర డ్యాం 68 టీఎంసీలకు చేరుకున్నది. తుంగ నది పరీవాహక ప్రాంతాల్లో భారీగా వర్షాలు కురుస్తుండటంతో టీబీ డ్యాంకు వరద భారీగా చేరుతున్నది. శనివారం ఇన్‌ఫ్లో 1,02,744 క్యూసెక్కులు ఉండగా, అవుట్ ఫ్లో 1,527 క్యూసెక్కులు నమోదైంది. తుంగభద్ర డ్యాం పూర్తిస్థాయి నీటి మట్టం 1633 అడుగులకు గానూ ప్రస్తుతం 1622.31 అడుగుల నీటి మట్టం ఉన్నది. డ్యాం గరిష్ఠనీటి నిల్వ 105.788 సామర్థ్యానికి గానూ ప్రస్తుతం 68.049 టీఎంసీలకు చేరుకున్నది.



తుంగభద్ర డ్యాంలో ప్రస్తుత నీటిమట్టం

## సంగంబండ, భూత్పూర్‌కు నీటి పంపింగ్



చిట్టెం నర్సిరెడ్డి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు కొనసాగుతున్న పంపింగ్

మక్తల్, జూలై 20 : భీమా ఎత్తిపోతల పథకంలో భాగంగా భీమా ఫేజ్-1లో నిర్మించిన చిట్టెం నర్సిరెడ్డి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్, భూత్పూర్ రిజర్వాయర్లకు పంపింగ్ కొనసాగుతున్నది. కృష్ణానదికి భారీగా వరద వస్తున్న నేపథ్యంలో కృష్ణానది నుంచి భీమా ఫేజ్-1కు చిన్నగోప్లాపూర్ నుంచి 1,300 క్యూసెక్కుల నీటిని రెండు మోటర్ల ఎత్తిపోస్తు సమాంతర కాల్వ ద్వారా భూత్పూర్ రిజర్వాయర్‌కు 500క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. భీమా ఫేజ్-1లోని స్టేజ్-2 పంప్ హౌస్ నుంచి రెండు మోటర్ల ద్వారా 800 క్యూసెక్కులు మక్తల్ తిరుమలయ్య చెరువు నుంచి చిట్టెం నర్సిరెడ్డి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్(సంగంబండ)కు నీటిని పంపింగ్ చేస్తున్నారు. చిట్టెం నర్సిరెడ్డి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ పూర్తి స్థాయి నీటి సామర్థ్యం 3.317.5 టీఎంలు కాగా ప్రస్తుతం 1.5 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ప్రాజెక్టు అధికారులు తెలిపారు. అదే విధంగా భూత్పూర్ రిజర్వాయర్ పూర్తి సామర్థ్యం 1.5 టీఎంసీలు కాగా ప్రస్తుతం 0.51 టీఎంసీల నీరు నిల్వ ఉన్నది. అయితే రెండు రిజర్వాయర్ల నుంచి రైతులకు సాగునీరు విడుదల చేస్తామని నీటి పారుదల శాఖ అధికారులు తెలిపారు.

## జూరాల వైపు వడివడిగా..

మక్తల్, జూలై 20 : ఎగువన ఉన్న కర్ణాటక రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో కృష్ణానదికి భారీగా వరద వస్తున్నది. కర్ణాటకలోని ఆల్మట్టి, నారాయణపూర్ ప్రాజెక్టులు పూర్తి స్థాయిలో నిండడంతో పలు గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తుండడంతో శనివారం కృష్ణానది వరద పోటెత్తింది. మక్తల్ నియోజకవర్గంలోని కృష్ణ మండలం తంగిడి వద్ద కృష్ణానది జిల్లాలోకి ప్రవేశించి జూరాల వైపుగా వడివడిగా పరుగులు పెడుతున్నది. మక్తల్ మండలం వల్లభాపురం వద్ద కూడా కృష్ణమ్మ ఉరకలు వేస్తుండడంతో ప్రజలు తరలివచ్చి వరద ప్రవాహాన్ని తిలకిస్తున్నారు.



మక్తల్‌లోని వల్లభాపురం దత్తపీఠం వద్ద కృష్ణానది పరవళ్లు

## నదీ పరీవాహక ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి

మక్తల్, జూలై 20: కృష్ణానది నదీ పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి అన్నారు. శనివారం మక్తల్ లోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అవసరం ఉంటేనే ప్రజలు బయటికి రావాలన్నారు. ఎగువ ప్రాంతం నుంచి కృష్ణానదికి భారీ వరద వస్తున్న నేపథ్యంలో కృష్ణ, మాగనూర్, మక్తల్ మండలంలోని నదీ పరివాహక ప్రాంతాల ప్రజలు నదివైపు వెళ్లరాదని చెప్పారు. పిల్లలు విద్యుత్ స్తంభాలు ముట్టుకోకుండా తల్లిదండ్రులు జాగ్రత్తపడాలని, మట్టిమిద్దెలు ఉన్నవారు జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

*హిందూ సంస్కృతి, సంప్రదాయాల్లో గురువుకు అగ్రతాంబూలం ఇచ్చారు.. తల్లిదండ్రుల తర్వాత ఆయన్నే ఎక్కువగా పూజిస్తారు.. సాక్షాత్తు పరబ్రహ్మతో సమానంగా గౌరవిస్తారు.. శ్రీరామచంద్రుడు అంతటి వాడే గురువుతో విద్యనభ్యసించాడంటే ఆ స్థానానికి ఉన్న ప్రాధాన్యత అర్థమవుతుంది.. గురువు లేనిదే జగత్తు లేదన్నది అక్షర సత్యమని చెప్పక తప్పదు.. అంతటి ప్రాధాన్యత ఉన్న గురువును కొలిచేందుకూ ఓరోజు ఉందండోయ్.. అదే గురుపౌర్ణమి.. దీనినే వ్యాసపౌర్ణమి అని కూడా పిలుస్తారు.. అందుకే నేటితరం గురువును ఆరాధ్య దైవంగా కొలుస్తూ తరిస్తున్నారు.. అందులో వేదవ్యాసుడు.. గురు దత్తాత్రేయుడు.. గురురాఘవేంద్రస్వామి.. షిర్డీ సాయి బాబా.. ఇలా ఎందరినో పలువురు ఆరాధిస్తున్నారు.*

*– గద్వాలటౌన్, జూలై 20*

*'గురుర్‌బ్రహ్మ .. గురుర్విష్ణుః.. గురుర్దేవో మహేశ్వరః.. గురుస్సాక్షాత్ పరంబ్రహ్మః.. తస్మైశ్రీ గురువే నమః..'*

# గురుదేవో నమోనమః

- నేడు గురుపౌర్ణమి
- వేడుకలకు ముస్తాబైన ఆలయాలు



ముస్తాబయిన సాయి మందిరం

గురు అనే సంస్కృత పదంలో గు అంటే అజ్ఞానమనే చీకటి అని.. రు అంటే తొలగించే వాడని.. అంటే అజ్ఞానమనే చీకటిని తొలగించేవాడు గురువని అర్థం. అష్టదశ పురాణాలను భావి తరాలకు అందించిన వాడు వ్యాసుడు. వ్యాస మహర్షి జన్మించింది ఆషాఢ శుద్ధ పౌర్ణమి నాడు. అందుకే ఈ పౌర్ణమిని వ్యాసపౌర్ణమి అని కూడా అంటారు. బడుల్లో పాఠాలు చెప్పే వారిని మాత్రమే గురువుగా సంబోధించడం పరిపాటి. కానీ సిద్ధపురుషులను, కారణ జన్ములను, జీవిత సారాన్ని అందించిన వారిని మాత్రమే గురువులుగా భావిస్తారు. అందుకు వ్యాస మహర్షి నిదర్శనం.

**గురుపౌర్ణమి నేపథ్యం..**

మహాభారత రచనల ద్వారా జగద్గురువుగా ప్రసిద్ధి చెందారు వ్యాస మహర్షి. వేదాలను విభజించి వేద వ్యాసుడుగా కీర్తి గడించారు. అజ్ఞానమనే అంధకారం తొలగించే విజ్ఞానమనే వెలుగును ప్రసాదించే వారు సద్గురువు అటువంటి సద్గురువులకు గురువుగా వ్యాసమహర్షి నిలిచారు. ఆయన ఉన్నతిని మననం చేసుకుంటూ మహర్షి జన్మించిన ఆషాఢ పూర్ణిమ రోజు వ్యాస భగవానుడి జయంతిని గురుపౌర్ణమి పేరుతో నిర్వహించుకోవడం ఆనవాయితీ. అదే ఆనవాయితీని నేటికీ కొనసాగిస్తున్నారు.

**వ్యాసుడి బాటలోనే..**

వేద వ్యాసుడు నుంచి గురు రాఘవేంద్రుడి వరకు, దత్తాత్రేయుడు నుంచి సాయిబాబా వరకు, ఆదిశంకరాచార్య నుంచి రమణ మహర్షి వరకు ఇలా ఎందరో సద్గురువులు జనాల్లోని అజ్ఞానాన్ని తొలగించి వెలుగు నింపేందుకు సద్గురువు వేద మహర్షి బాటలో పయనించిన వారే. వారందరినీ మననం చేసుకుంటూ గురుపౌర్ణమి నాడు గురుసేవ చేయడం సముచితం. అందుకే ఎవరికి ఇష్టమైన గురువును.. కానీ గురువులా భావించే వారిని కాని కొలవడం అనాధిగా వస్తున్నది.

**గౌరవిస్తేనే ఉన్నతి..**

సంస్కారం నేర్పడమే కాదు ఆచరించేలా శిష్యుడి మనసును నియంత్రించే విధాత గు రువు. గురువును గౌరవించినప్పుడే శిష్యుడికి ఉన్నతి లభిస్తుందని పురాణాలు చెబుతున్నా యి. గురువులు కూడా ధనార్జనే విద్యకు పరమార్థమనే భావనతో కాకుండా నైతిక విలువలను నేర్పించేలా గురువులు కూడా కృషి చేయాలనేదే గురుపౌర్ణమి పరమార్థమని పండితులు చెబుతున్నారు.

**ప్రత్యేక కార్యక్రమాలు..**

గురుపౌర్ణమిని పురస్కరించుకొని ఆదివారం సాయి మందిరాలతోపాటు వివిధ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. అలాగే నదీఅగ్రహారంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి వారి కల్యాణోత్సవా న్ని నిర్వహించేందుకు నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. రాఘవేంద్రస్వామి మఠంలో, భూలక్ష్మిచెన్నకేశవ స్వామి ఆయంలో పౌర్ణమిని పురస్కరించుకొని సత్యనారాయణస్వామి సామూహిక వ్రతాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.

## హైదరాబాద్‌లో ఫొటోఎక్స్‌పో

- 26 నుంచి మూడ్రోజులు నిర్వహణ
- పోస్టర్‌ను ఆవిష్కరించిన మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

మహబూబ్‌నగర్ అర్బన్, జూలై 20 : తెలంగాణ రాష్ట్ర ప్రొఫెషనల్ ఫొటో అండ్ వీడియో గ్రాఫర్స్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఫొటో ట్రేడ్ ఎక్స్‌పో ఎగ్జిబిషన్ పోస్టర్‌ను శనివారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఆవిష్కరించారు. ఈనెల 26, 27,28 తేదీలో హైదరాబాద్‌లోని ఎల్బీనగర్ కేవీఆర్ కన్వెన్షన్ హాల్‌లో ఫొటో ఎగ్జిబీషన్ నిర్వహిస్తున్నట్లు ఫొటో అండ్ వీడియో గ్రాఫర్స్ సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో సంఘం నాయకులు జగదీశ్, శైలేందర్, జగ్గారెడ్డి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

## యజ్ఞయాగాలతో సకల జీవకోటి సుభిక్షం

- మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి



యాగం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి దంపతులు

నాగర్‌కర్నూల్, జూలై 20 : యజ్ఞ, యాగాలు చేయడం వల్ల సకల జీవకోటి సుభిక్షంగా ఉంటుందని మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి అన్నారు. శనివారం నాగర్‌కర్నూల్ పట్టణంలో శ్రీ కృష్ణ పీఠాధిపతి కృష్ణజ్యోతి స్వరూపానందస్వామీజీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న మహోయాగ మహోత్సవంలో మర్రి దంపతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామీజీ దివ్య మంగళ శాసనాలతో నిర్వహిస్తున్న ఆయుత చండీఅతిరుద్రయాగం, సుదర్శన చండీహోమంలో పాల్గొన్నారు. అంతకుముందు మర్రి దంపతులకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం స్వ రూపానందస్వామీజీ ఆశీస్సులు పొందారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.